
రంజని - రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక కథానికల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# తల్లీ నిన్ను దలంచి...



ఫైవ్ స్టార్ హొటల్లా వుందా ఆసుపత్రి.

సెక్యూరిటీ గార్డ్ గాజు తలుపుని తెరచి పట్టుకోగా లోపల అడుగు పెట్టారు రామీ రాముడూ.

చల్లనిగాలి రివ్వున వచ్చి ఒంటిని ఆహ్లాదపరచింది. లోపల అడుగడుగునా అందం పరచుకునుంది. విద్యుద్దీపాలు వెలుగుల్ని విరజిమ్ముతున్నాయి. ఆసుపత్రి అద్దంలా ఉంది. దుమ్మూ ధూళీ అన్నవే లేవు. క్యాబిన్ల వెనుక డాక్టర్లూ నర్సులూ రిసెప్షన్ ఉద్యోగులూ – ఎంతో బిజీగా ఉన్నారు.

పేషంట్లూ రూముల్లో 'హ్యాపీగా' ఉన్నారు. టీవీతో సహా సకల సౌకర్యాలూ అందుబాటులో ఉన్నాయి. రోగులూ వారిని చూడవచ్చే వారే కాదు వారి జబ్బులూ ఖరీదైనవే మరి.

అబ్బురంగా చుట్టూ చూసి, "ఓలమ్మో! ఎంత బావుందో. ఇది ఆసుపత్రేనా?" అడిగింది భర్తని.

"గొప్పోళ్ళ ఆసుపత్రే. ఆరికి రోగం కూడా సుకవేనే ఎర్రి మొకమా.... మంగారావు డాక్టరు యాడా కన్పించదేంటి?" చుట్టూ కలయజూస్తూ అన్నాడు రాముడు.

"మాట తప్పే మనిసి కాదు. యాడనో ఉండే ఉంటాడు. పై కెక్కి సూద్దావాం మావా.....?"

"ఇక్కడే వుండమన్నాడే తింగర బుచ్చీ....."

ఇంతలో చంకలో క్యాష్ బ్యాగ్ పెట్టుకుని హడా విడిగా వచ్చాడు మంగారావు డాక్టరు. అతడూ వారి ఊరి వాడే. ఆరెమ్పీ డాక్టర్.

"ఎప్పుడో రమ్మంటే ఇప్పుడొచ్చారా! అవతల పెద్ద డాక్టరు చిందులేస్తున్నాడు. పదండి..... పదండి...."

ఒక డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాడు. "నీకెంత మంది పిల్లలు?" రామిని అడిగాడతడు.

"ఇద్దరండి'

"ఆరోగ్యంగానే వున్నారు కదా?"

"సక్కగా సదూకుంటన్నారండి. ఆళ్ళ సదువుల కోసవే దీని కొప్పుకున్నావండి"

"నెలనెలా ముట్లు అవుతున్నాయా?"

"అయ్"

"నీ వయస్సెంత?"

"వచ్చే తొలేకాశికి ముప్పై నిండుతాయండి"

ఆయనో స్లిప్ రాసి నర్సు కేదో చెప్పేరు. ఆమె రామిని తీసుకెళ్ళి ల్యాబ్ టెక్నీసియన్‌కి అప్పగించింది.

రక్త మూత్ర పరీక్షలు చేశాడు. మరో డాక్టర్ స్కానింగ్ ద్వారా గర్భాశయాన్ని పరీక్షించాడు. ఓ మహిళా డాక్టరూ పరీక్షించింది.

కేంటీన్లో భోంచేస్తోంటే అన్నాడు రంగారావు డాక్టరు "క్లీన్ రిపోర్టొస్తే మీ అదృష్టం పుచ్చినట్టే"

"వత్తది లెండి. పొద్దుగూకులూ కట్టపడేవోళ్ళం. రోగాలూ రొచ్చులూ మాకెందు కొత్తాయి!" అన్నాడు రాముడు.

"నీ సంగతి పక్కన పెట్టు. రామి ఆరోగ్యమే ముఖ్యం. ఈ డీల్ కుదిరితే నువ్వు కొన్నాళ్ళ పాటు నీ పెళ్లాం పక్కెక్క కూడదని కండిషన్ పెడతారు"

"అన్నీ ఒప్పుకుంటాను. డబ్బేమాత్రం ఇత్తారు?" ఆశగా అడిగాడు.

"రెండు మూడు లకారాలు ఇస్తారు"

"ఇందిరమ్మ ఇంటికి కప్పు ఏసేత్తాను. దీనెమ్మ మొండిగోడలు సూళ్ళేక సత్తన్నాను!"

"అదేం కుదర్దు. పిల్లగాళ్ళ సదువుల కోసవేఁ ఈ సిగ్గుమాలిన పని కొప్పుకున్నా. ఆళ్ళిచ్చే సొమ్మంతా బేంకిలో ఏసెయ్యాల్సిందే. మంగారావు డాక్టరూ చచ్చి నీ కడుపున పుడతాగాని ఆ పనీ నువ్వే సేసిపెట్టాలి"

"నానేవన్నా తాగి తందనాలాడతానంటన్నానా. మనింటికే కదా పెడతానంటన్నా"

"సర్కారోడు సొమ్మిచ్చినప్పుడే ఎయ్యి. అంతదాకా పసారాలో తొంగుంటాంలే. పిల్లగాళ్ళు బాగా సదూకుంటే ఆపీసర్లవుతారు. నీడపట్టున పేనుకింద కూకుంటారు. మన కడుపున బుట్టినందుకు అది కూడా సెయ్యకపోతే ఎట్టా!"

"అది కాదే రామీ.....!"

"ఇక్కడ డిస్కషన్ పెట్టకండి. అవన్నీ కరెన్సీ చేతిలో పడ్డాక ఆలోచించొచ్చులే. నడండి డాక్టర్ని కలుద్దాం" కసిరాడు మంగారావు డాక్టరు.

పెద్ద డాక్టర్ని కలిశారంతా. మొదట కలిసిన డాక్టరే. టెస్ట్ రిపోర్టులు చూస్తున్నాడు. అతడి మొహం ప్రసన్నంగా వుండే సరికి మంగారావు డాక్టరుకి హుషారొచ్చింది.

"డాక్టర్ అనంత్ అనీ మన డాక్టర్ గారే. ఈ హాస్పిటల్ ఓనర్ గారి రెండో అల్లుడు. మహా చురుకు. ఇక్కడి కొచ్చే పేషంట్లలో సగం మంది ఇతర దేశాలనుంచే వస్తున్నారు. అదంతా మన డాక్టర్ గారి చలవే" అంటూ పొగిడేడు.

"అంతా చెప్పేవా?" అడిగాడతడు.

"మీరింకా సిగ్నల్ ఇవ్వలేదు కదండీ.... అంతా ఓకేనా?"

"ఓకే ఓకే. ముందు టెరమ్స్ మాట్లాడేస్తే తర్వాత ఫారన్ కపుల్‌కి పరిచయం చెయ్యొచ్చు. ఈమె హెల్త్ గురించి వాళ్ళు శాటిస్‌ఫై అవ్వాలిగా"

డాక్టర్ మాటలకి తలాడిస్తూ అన్నాడు "పాయింట్లన్నీ చెప్పేయండి. ఆల్రెడీ నేను గ్రౌండ్ తయారు చేసేశాన్లెండి....."

వారి సంభాషణ అర్థంగాక టెన్షన్ పడుతున్నారు రామీ, రాముడూ.

రామి అయితే ఎలాగైనా ఈ అదృష్టాన్ని చేజిక్కించమని ఏడుకొండల వాడికి మొక్కేస్తోంది.

"అమెరికా నుంచి మిస్టర్ గోల్డ్ స్మిత్ అతడి భార్య లిజ్ మా హాస్పిటల్‌కి వచ్చారు. మాపేరు ప్రఖ్యాతుల దృష్ట్యా ఇలా చాలా మంది ఎక్కడెక్కడ్నుంచో వస్తూంటార్లే. విషయం ఏమిటంటే వాళ్ళకి బిడ్డ కావాలి. చాలా మందిలా సంతానం కలగక రాలేదు. కనేంత తీరిక లేక వచ్చారు. చాలా బిజీ పీపుల్లే. అదీ గాక నైన్ మంత్స్ బిడ్డని కడుపులో మోయడం, పురుటి నొప్పులు భరించి బిడ్డని కనటం లిజ్‌కి బొత్తిగా ఇష్టంలేదు. భయమూ ఉండి వుంటుందిలే. అంచేత ఓ గర్భాన్ని అద్దెకు తీసుకుని రెడీమేడ్‌గా బిడ్డని పొందాలని వాళ్ళ ప్లాన్. అందుకని మిమ్మల్ని పిలిచాం. మీరు పేదవారని ఈయన చెప్పేడు. మీకు హెల్ప్ చేసినట్టు ఉంటుందని మిమ్మల్ని సెలక్ట్ చేశాం" ఆగాడు డాక్టర్.

"అరటి పండు ఒలిచినట్టు చెప్పేరు. ఓకే అనెయ్యండిహ" మంగారావన్నాడు.

"ఏవిత్తారో ఆ ముక్క కూడా సెప్పేత్తే...." బుర్ర గోక్కున్నాడు రాముడు.

మోచేత్తో భర్తని పొడుస్తూ "ఏంసెయ్యాలో ఏంటో తిరకాసులూ గట్రా ఏం వున్నాయో అడగవేంటీ!" అంది రామి.

మందహాసం చేశాడు డాక్టర్. "అన్నీ చెబుతాను. ఇందులో అనుమానించాల్సిందీ భయపడాల్సిందీ ఏమీలేదు. మొత్తం ప్రపంచంలోనే మన హైదరాబాద్ ఆరోగ్య రాజధానిగా పేరు పొందింది. ఇక్కడ ఆధునిక సౌకర్యాలున్నాయి. గొప్ప డాక్టర్లున్నారు. ఖర్చు తక్కువే. అందుకని ఇతర దేశాల నుంచి ఇక్కడికి పెద్దరోగాల కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఇకపోతే ఎలాటి వారినైనా సంతానవంతుల్ని చెయ్యడం మా ఆసుపత్రి ప్రత్యేకత. ఐవిఎఫ్‌లో అంటే ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ ద్వారా బిడ్డని కనిపించి ఇవ్వడ మన్నమాట. అందులో మాకు గొప్ప పేరుంది. దానికోసం ఎందరో కపుల్స్ ఆఖరికి గేలు కూడా వస్తూంటారు.

మేం కూడా రిప్రొడక్టివ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ నీలాంటి అద్దెతల్లుల్ని తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేస్తున్నాం. మన ఆడవాళ్ళు సంతానలక్ష్ములు కదా!" నవ్వేడు అనంతం.

"నాకు ఒక్క ముక్కా అర్థం కాలేదండి"

రామి మాటలకు రాముడూ తలాడించి ప్రశ్నార్థకంగా చూశాడు.

"రామికి మాట వస్తుందేమోనని వీళ్ళ భయం. నేను చెప్పేననుకోండి అయినా గాని మీరు శంఖంలో పోస్తే తీర్థమైపోతుంది"

మంగారావు మాటలకు తలపంకించాడు డాక్టర్.

"మగవారితో కలవనక్కర్లేకుండానే ఈ సిస్టంలో పిల్లలు పుడతారు. అమెరికా దంపతుల నుంచి స్త్రీ అండాన్నీ పురుష బీజాల్నీ సేకరిస్తాం. ల్యాబ్‌లో వాటిని ఫెర్టిలైజేషన్- ఫలధీకరణ చేయిస్తాం. ఆ తర్వాత దాన్ని నీ గర్భంలో ప్రవేశపెడతాం. అక్కడ బిడ్డ పెరుగుతుంది. మామూలు గానే గర్భం, నొప్పులు, డెలివరీ అన్నీ వుంటాయి..... బిడ్డకన్నీ అమెరికా దంపతుల లక్షణాలే వస్తాయి గాని మీవేమీ రావు. నువ్వో మీడియం - ఖమీస్ నిమిత్త మాత్రురాలివన్న మాట!"

"అంతా తవరు సెప్పినట్టే జరుగుద్ది కదాండి?" మనస్సు లోపలేదో చిన్న అనుమానం పీకుతోంటే అడిగింది రామి.

"ఖచ్చితంగా అలాగే జరుగుద్ది. అమెరికా అతను నీ దగ్గరకి రాను కూడా రాడు. నువ్వు కేవలం నీ గర్భాన్ని అద్దెకిచ్చిన కిరాయి మనిషివి. అంతే. బిడ్డ మీద నీకెలాంటి హక్కులూ అధికారాలూ వుండవు. డెలివరీ అయ్యాక వెంటనే గాని రెండు మూడు నెలల్లోగాని వాళ్ళు తీసుకుపోతారు. ఎలా ఏవిటి అన్న లీగల్ విషయాలు వాళ్ళు చూసుకుంటారు. దానితో మాకూ ఏమీ సంబంధం లేదు"

"బిడ్డని కనివ్వడమే నీ బాధ్యత. ఆడబిడ్డా మగబిడ్డా అన్నది కూడా మనకి అనవసరం...." మంగారావు వివరణ జోడించాడు.

"రామి కేవన్నా అయితే...?"

భర్త మాటలకి భయపడి అతడి చేతిని గట్టిగా పట్టుకుని ఆందోళనగా చూసింది రామి.

"ఏమి కాకుండా చూసే పూచీనాది. అదీ గాక రామికిది తొలికాన్పు కాదుగా. మూడో కాన్పు అవుతుంది. ఈజీగా డెలివరీ వస్తుంది....."

"అలాంటి భయాలేం పెట్టుకోవద్దు. ఇలాంటివి మన డాక్టర్‌గారు నెలకి అయిదారు చేస్తూంటారు. ఇంకా సంగతి వదిలి ఇచ్చుకోటాల గురించి చెప్పెయ్యండి ఓ పనైపోద్ది"

"మేం చెప్పినప్పుడు హాస్పటల్ కొచ్చి ఒక నెలరోజుల దాకా వుండాలి. మొదటిసారే సక్సెస్ అయితే ఫర్లేదు, లేకపోతే ఇంకో రెండు మూడు సార్లు రావాల్సి వుంటుంది. అన్ని సార్లూ అన్నేసి రోజులుండక్కర్లేదు. మీకేమీ హాస్పటల్ ఖర్చుండదు. గర్భం నిలబడ్డాక మీరు సిటీకొచ్చి ఉండాలి. చక్కని వాతావరణంలో ఉండాలి. పుష్టికరమైన తిండి తినాలి. అందుకు మేం ఏర్పాట్లు చేస్తాం. మధ్య మధ్య చెక్కింగులకీ ఆఖర్న డెలివరీకీ ఇక్కడికి రావాలి. ఆ తర్వాత బిడ్డని అప్పగించి మీ ఊరెళ్ళిపోవచ్చు. మూడు లక్షలిస్తాం"

తోసుకొచ్చిన సంతోషాన్ని తొక్కిపట్టి "మద్దెన మాట మార్చి తిరకాసు పెట్టరు గందా?" అనుమానం వెలిబుచ్చాడు రాముడు.

టేబుల్ మీది ఓ పేపర్ని చూపిస్తూ "అన్ని టెరమ్సూ ఇందులో రాసి ఉన్నాయి. ఎలాంటి మోసానికీ తావు లేదు. ప్లీడర్‌కి చూపించుకున్నా మాకేం అభ్యంతరం లేదు" అన్నాడు డాక్టర్ అనంత్.

"క్రితం సారి రెండు లక్షలే ఇచ్చారు వీళ్ళకి ఏకంగా మూడు ఇస్తున్నారు....."

మంగారావు వంక పానకంలోని పుడకని చూసినట్టు చూశారు రామీ రాముడూ!

"పిల్లల చదువుల కోసం దీనికి అంగీకరించారని చెప్పేవు కదా. అందుకని ఎక్కువ ఇప్పిస్తున్నాను"

గబుక్కున సీట్లోంచి లేచి డాక్టర్ కాళ్ళకి దణ్ణం పెట్టింది రామి. "తవఁరే మాకు దేవుడు. నా బిడ్డలకి దారి సూపి పున్నెం కట్టుకోండి"

"ఆలస్యం అమృతం విషం అన్నారు. ఇక సంతకాల కార్యక్రమం కూడా కానిచ్చెయ్యండి...." తొందరపెట్టాడు మంగారావు.

"అమెరికన్స్ వీళ్ళని చూసి ఓకే చెయ్యనీ....." అంటూ ఇంటర్‌కమ్‌లో ఎవర్తోనో మాట్లాడాడు డాక్టర్.

మిస్టర్ గోల్డ్ స్మిత్, అతడి భార్య లిజ్ లోపలికి వచ్చారు. డాక్టర్ వారికి రామిని పరిచయం చేశాడు.

"సీమ్స్ హెల్దీ....." గోల్డ్ స్మిత్ అన్నాడు భార్యతో.

"యాఁ!"

'నాకంటే ఒకట్రెండేళ్ళు పెద్దదానిలా వుందంతే. గుర్రంలా బలంగా గిలంగానే ఉంది. మరి పిల్లల్ని కనడానికేం దొబ్బుడాయో! ఆ గొడవ మన కెందుకులేమ్మా. అలాటోళ్ళు వుండబట్టే మాకిలా కలిసొచ్చింది! అదే పదేలు!' అనుకుంది రామి లిజ్‌ని చూసి.

చకచకా సంతకాలు పూర్తయ్యాయి. పాతిక వేలు ఎడ్వాన్సు ఇచ్చారు. గబుక్కున అందుకున్నాడు రాముడు.

హైదరాబాద్ బిర్యానీ తిని గాలిలో తేలిపోతూ ఎర్రబస్సులో ఇంటికెళ్ళారు.

పిల్లలిద్దర్నీ సందిట్లోకి తీసుకుని "అయిదరాబాదెళ్ళి పోతాంరా. పెద్ద పెద్ద ఇస్కూళ్ళు ఉంటాయి. బాగా సదూకొని గొప్పోళ్ళవ్వాల" అంది. ఆమెకి తెలీకుండానే కన్నీళ్ళు జలజలా రాలాయి!

వార్త ఊళ్ళో బంధువుల్లో గుప్పుమంది.

కొందరు అసూయపడ్డారు. ఇంకొందరు 'నీతిలేంది' అని తిట్టారు. 'హవ్వ! కడుపు అమ్ముకుంటుందా? కడుపు తీపి తెలీని ఆడది!' అని ఈసడించారొకరు.

చిత్రంగా మంగారావు డాక్టర్ని కలిసే వారి సంఖ్య పెరిగింది. అంతదాకా ఊగిసలాడిన వాళ్ళు అవకాశం చేజారినందుకు చింతిస్తూ 'మేపూఁ రెడీయే. మాకూ మంచి బేరం సూపించండి. మీ రుణం ఉంచుకోం" అంటున్నారు!

ప్రాక్టీసుకన్నా ఈ బ్రోకరేజే బాగుందనుకుంటున్నాడు మంగారావు డాక్టరు.

* * *

ఆసుపత్రి నుంచి కబుర్రావడం ఆలస్యం ఆఘమేఘాల మీదెళ్ళారు రామీ రాముడూ. ఆలస్యం చేస్తే అదృష్టాన్ని ఎవరు తన్నుకుపోతారోనని వారి భయం!

మొదటి ప్రయత్నమే సఫలమయ్యింది.

అమెరికా దంపతులే కాదు ఆసుపత్రి వారూ పొంగిపోయారు. రామి ఫొటో తమ వెబ్‌సైట్లో పెట్టి బిజినెస్ పెంచుకునే ఏర్పాట్లూ మొదలెట్టారు.

రామి, రాముడు పిల్లలతో సః సిటీకి మకాం మార్చారు. ఆసుపత్రి దగ్గర్లో వారికోసం తీసుకున్న అపార్ట్‌మెంట్‌లో దిగారు. వారికది ఇంద్రభవనంలా వుంది. పండ్లూ పాలూ లాటివి అరేంజ్ చెయ్యడమే గాక ఒక నర్సుని ప్రత్యేకంగా కేటాయించారు.

రాముడు బిల్డింగ్ నిర్మాణపు కూలీగా కుదురుకున్నాడు. పిల్లల్ని స్కూల్లో జేర్పించారు.

చక్కని ఆహారం, ఎంచక్కని దుస్తులు, చీకూ చింతా లేకుండా గడిచిపోతోంది కాలం. నర్సు ఎప్పటికప్పుడు ఇంటికొచ్చి సూచనలిస్తోంది. మధ్య మధ్య టెస్టులు చేసి సంతృప్తి వెలిబుచ్చారు ఆసుపత్రివారు.

రామి ఫోటోలు, బిడ్డ స్కానింగ్ రిపోర్టులూ ఎప్పటికప్పుడు అమెరికా దంపతులకి చేరుతున్నాయి.

రామికి మరో బిడ్డని మోస్తున్నట్టే ఉంది గాని పరాయి బిడ్డని కడుపులో పెంచుతున్నట్టుగా ఏ కోశానా లేదు. బిడ్డ ఎదుగుదల  గురించెంతో ఆరా తీస్తోంది. అంతా సక్రమంగా ఆరోగ్యంగా ఉందని విని పొంగి పోతోంది.

బిడ్డ కదలికలకు గత రెండు కాన్పుల్లో లానే స్పందిస్తోంది. అర్ధరాత్రి భర్తని లేపి మరీ అపురూపంగా చెబుతోంది. అటువంటప్పుడు విసుక్కున్నా మిగతాప్పుడు బిడ్డ కబుర్లు చక్కగానే వింటున్నాడు రాముడు.

"అన్నీ బాగా జరిగి ఆళ్ళబిడ్డని ఆళ్ళకప్పగించేత్తే శాన. బతికి బయటపడి పోతాం" అని పైకి అంటూ, 'మన డబ్బు మన సేతిలో పడిపోద్ది' అని లోపలనుకుంటున్నాడు.

ఈడీడీ రోజునే ఆసుపత్రిలో చేర్చుకున్నారు. ప్రత్యేక రూములో సకల సరంజామాతో సిద్ధంగా ఉన్నారు.

గోల్డ్‌స్మిత్తూ లిజ్ అమెరికా నుంచి వచ్చారు. రామిని పలకరించారు. డాక్టర్లతోనూ మాట్లాడారు. బిడ్డ బరువునీ పొడుగునీ తెలుసుకున్నారు. హార్ట్ బీట్ విన్నారు.

రామి కడుపులోని బిడ్డని స్కానింగ్ చేస్తూండగా చూసి "అవర్ బేబీ! అవర్ లవ్!" అని మురిసిపోయారు. ముద్దులు పెట్టుకున్నారు.

నొప్పులు మొదలయ్యాయి. అంతకంతకీ ఉధృతమవుతున్నాయి. బాధ భరించలేక కేకలు పెడుతోంది రామి.

"బేబీ పొజిషన్ మారింది..... డెలివరీ కష్టమయ్యేట్టుంది..... ఇదే సిట్యుయేషన్ కంటిన్యూ అయితే తల్లికి కష్టం....."

ఫోన్లో లేడీ డాక్టర్ మాటలు వింటూనే తల పట్టుకున్నాడు డాక్టర్ అనంత్.

"డు ఎవ్విరి పాజిబుల్ థింగ్. బోత్ మదర్ అండ్ చైల్డ్ ఆర్ ఇంపార్టెంట్....." అన్నాడు

అరిచినట్టుగా.

అతడి కెదురుగా కూర్చునున్న గోల్డ్‌స్మిత్ అలర్టయ్యాడు. "వుయ్ వాంట్ అవర్ బేబీ సేఫ్..... ఇఫ్ నెససరీ అయాం రెడీ టు పే ట్వంటీ థౌజండ్ డాలర్స్ ఫర్ దట్ ఫ్యామిలీ....."

అతడి బిజినెస్ సెన్స్ నచ్చినప్పటికీ, 'ఎంత స్వార్థం! తన బిడ్డ ముఖ్యమట. రెండో ప్రాణం ఏమైనా ఫర్లేదుట!' అనుకోకుండా ఉండలేకపోయాడు అనంత్.

"డోంట్ వర్రీ. యువిల్ హేవ్ యువర్ బేబీ.... సేఫ్‌లీ!"

మరొక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా సిజేరియన్ చేశారు. రామి మరో ప్రాణికి జన్మనిచ్చింది. భూమ్మీద పడుతూనే కెవ్వుమన్నాడు.

'ఏ జాతి బిడ్డ అయినా ఇంతే కాబోలు!' అనుకుంది రామి.

బిడ్డని చూపించారు. తెల్లగా దొరబిడ్డలా వున్నాడు. మురిసిపోయింది. నొప్పుల బాధని పూర్తిగా మర్చిపోయి అపురూపంగా చూస్తూనే మగతలోకి జారుకుంది.

వాతం కమ్మింది. డాక్టర్లు హడావిడి పడ్డారు. ఏమైతేనేం మరో గండం గడిచింది. ఆ వంకన హాస్పటల్‌కి మరికొంత 'లబ్ధి' చేకూరింది.

బిడ్డకు 'హనీ' అని పేరు పెట్టారు స్మిత్తూ లిజ్జూ.

* * *

డాక్టర్ అనంత్ గోల్డ్ స్మిత్‌తో ఫోన్లో మాట్లాడుతూ టెన్షన్‌గా ఉన్నాడు.

"మైగాడ్! అబ్జెక్షన్ ఎందుకు? అమెరికాలో సరోగసీ పర్మిటెడ్ కదా. అలా అని సర్టిఫికెట్ ప్రొడ్యూస్ చేశారుగా. మరింకేవిటి ప్రోబ్లం?"

"అన్ని పేపర్లూ సబ్మిట్ చేశాం. ఎంచేతో హనీకి అమెరికన్ సిటిజెన్‌షిప్ గ్రాంటవ్వలేదు....."

"పేరెంట్ షిప్ గురించి డౌటొస్తున్నాయేమో. లాస్ట్ మేలో ఒక కేసులో ఇజ్రాయిల్ కంట్రీ ప్రత్యేకంగా డీఎన్ఏ రిపోర్టు కోరింది. దాని ద్వారా పెటర్నిటీ ఎస్టాబ్లిష్ అవ్వగా పాస్‌పోర్ట్ శాంక్షన్ చేసింది....."

"ఐ ట్రైడ్ మై లెవెల్ బెస్ట్...... మీకు తెలుసుగా. ఇప్పటికే హాఫ్ లాక్ డాలర్స్ ఇన్వెస్ట్

చేశాను....."

"అది సరే. మీ దేశపు సిటిజన్ షిప్ రాకపోతే ఎలా? ఇక్కడి సిటిజన్ షిప్పూ రాదుగా! ఆమధ్య జర్మనీ కపుల్ ఎఫైయిర్లో లాగా అవుతుందేమోనని భయంగా వుంది....."


"ఏమయ్యింది"?

"బేబీ స్టేట్‌లెస్ అయ్యింది!"

* * *

డాక్టర్ అనంత్, మంగారావు డాక్టర్ రామి వాళ్ళుంటోన్న అపార్ట్‌మెంట్‌కొచ్చారు.

బిడ్డకి పాలు ఇస్తోందల్లా వాళ్ళొచ్చారని విని కంగారు పడింది రామి. గత ఆర్నెల్ల నుంచీ మరింత చేరువయ్యాడు హనీ.



"అదిగో ఇదిగో అంటూ రోజులు దొర్లించేస్తున్నారు. బుడ్డోడ్ని ఇంకెప్పుడు తీసుకెళ్తారూ?" విసుగ్గా విసురుగా అడిగాడు రాముడు. ఎక్కడ ఆ బిడ్డని తమకి 'అంటగట్టేసి' చేతులు దులిపేసుకుంటారోనని అతగాడి భయం!

"నీకిస్తానన్నది ఇచ్చేశారు. ఈ ఆర్నెల్ల ఖర్చు కూడా పెట్టుకున్నారు. అంతే గాని ఇచ్చిన డబ్బు తిరిగివ్వమన్లేదుగా. తొందరపడతా వెందుకు? మన దురదృష్టవశాత్తూ సమస్య

వచ్చిపడింది. ఎవరికీ నొప్పి కలక్కుండా చక్కబెట్టుకోవాలి గాని అల్లరవ్వకూడదు. అల్లరైతే అందరికీ నష్టమే" లౌక్యం ప్రదర్శించాడు మంగారావు.

ఏవిటంటూ బిడ్డతో గదిలోంచి వచ్చింది రామి.

"ఎంచేతో వీడికి అమెరికా పౌరసత్వం రాలేదు. ఇండియన్స్‌కి పుట్ట లేదు గనుక ఇక్కడా ఉండనివ్వరు. ఏదో దారి చూసి వీడ్ని వదిలించుకోవాలి....."

వాడి బాణం సూటిగా గుండెల్లో దిగిన పక్షి కూనలా విలవిల్లాడుతూ చూసింది రామి. "సదూకున్నోరు. తవఁరే అలాగంటే ఎలా బాబయ్యా" కన్నీళ్ళు చిప్పిల్లుతోంటే నిలువునా కంపించిపోతూ అంది.

"వీడు స్టేట్‌లెస్. అంటే ఏ దేశానికీ చెందనివాడు. ఎక్కడా ఉండ నివ్వరు" వివరించడానికి ప్రయత్నించాడు మంగారావు.

"అదేం మాట. ఇంత భూమి ఉంది. ఈ పసివాడికింత చోటేలేదా? చిత్తరంగా మాటాడతన్నారేంటి!"

"నీకెలా చెప్పాలో అర్థం కావట్లేదు. వీడ్ని మన దేశంలో ఉంచుకోవడం నేరం అవుతుంది" మెల్లగా చెప్పేడు అనంత్.

"అయితే తీసుకుపోండి. మాకెందుకీ పెంట!" రోషంగా అన్నాడు రాముడు..

"నువ్వుండు మావా. ఆళ్ళకి అక్కర్లేకపోతే పొమ్మనండి. తవరికి కష్టంగా వుంటే తవరూ ఎల్లిపోండి అంతేగాని ఈడ్ని నడిరోడ్డు మీద వొదిలెయ్యను. ఈడు నా బిడ్డ. విత్తనం నాది గాకపోయినా భూమి నాదే. ఈడ్ని తొమ్మిది నెల్లు మోసిందీ నొప్పులు పడిందీ నేనే. పురిటి కష్టం పడిందీ నేనే కన్నదీ నేనే. ఈడి తల్లిని నేనే. ఎవరి కక్కర్లేకపోయినా ఈడు నాక్కావాల. నా పేగు తెంచుకు పుట్టాడు. నేను పేణం పోసిన ఈడికి నేనే బతుకిత్తాను. ఎవరు కాదంటారో ఎవరడ్డొత్తారో నేనూ సూత్తాను!"

రామి ఒక పేదరాలిగా ఒక ఆడదిగా కాదు జగన్మాతగా కన్పించగా తలలు దించుకున్నారు అక్కడున్న మగాళ్ళు ముగ్గురూ!

**(ఈవారం 10.7.2011)**